క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వినోద్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వేమనపల్లి, బెల్లంపల్లి, కన్నెపల్లి తదితర మండలాలకు చెందిన శ్రేణులు దాదాపు 100మందికి కాంగ్రెస్ కండువా కప్పి రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మత్తమారి సూరిబాబు, మల్లారపు చినరాజం, బత్తుల రవి, అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'శిఖం భూమి కబ్జాపై ఫిర్యాదు'

నెన్నెల: మండల కేంద్రంలోని దసలికుంట శిఖం భూమిలో మట్టిని పోసి నిర్మాణం చేపట్టేందుకు భూమిని కబ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులు శనివారం తహసీల్దార్ భూమేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని శిఖం భూమిని కాపాడాలని లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎల్లేల రాజేష్, మంచర్ల సంజయ్‌కుమార్, రాజశేఖర్, భీంగి సురేష్, మంచర్ల రాజేష్, ఇందారపు బక్కయ్య, శ్రీనివాస్, గంగాధర్ ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

తాండూర్: రాష్ట్ర అవతరణ, దశాబ్ది వేడుకల్లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 'మానవాళి మనుగడలో అడవుల పాత్ర' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మాదారం డెప్యూటీ రేంజ్ అధికారి జె.తిరుపతి, మాదారం ఎఫ్‌బీఓ సఫియా బేగం, తాండూర్ ఎఫ్ఎస్ఓ సువర్ణ, ఎఫ్‌బీఓ గోపికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్టీ జాబితాలో చేర్చాలి'

బెల్లంపల్లి: అనాగరిక జీవనాన్నీ సాగిస్తున్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో కలిపి జీవనోపాధిని కల్పించాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి మల్లేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సల్లా వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడారు.

'దళితబంధు పథకంలో నేతకానీలకు అన్యాయం'

జన్నారం: దళితబంధు పథకంలో నేతకాని కులస్తులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ ఆరోపించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడుత దళితబంధు పథకం అమలులో ఖానాపూర్ నియోజకవర్గంలో ఉట్నూర్, కడెం మండలాల్లో నేతకాని కులస్తులను విస్మరించారని ఆరోపించారు.

ట్రాక్టర్ వినియోగంపై రచ్చ



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలో మున్సిపల్ ట్రాక్టర్లలో ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన ఇటుకలను నింపడంపై స్థానికులు ఫొటోలు తీసి, సోషల్ మీడియాలో వేయడంతో రచ్చగా మారింది. మున్సిపల్ ట్రాక్టర్లను సొంత అవసరాలకు వినియోగిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రచారం చేయడంతో, కాలనీలోని డ్రెయినేజీ చాంబర్‌ల వద్ద పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి ప్రమాదభరితంగా ఉండడంతో, వాటిని మూసేందుకు, ఓ దాత ఇటుకలను ఇవ్వగా, వాటిని తీసుకెళ్లి, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను చేపడితే, దానిపైన దుష్ప్రచారం చేస్తున్నారని అధికార పార్టీకి చెందిన నాయకులు అంటున్నారు.



గిరిజనుల అభివృద్ధికి సర్కారు పెద్దపీట

- గిరి వికాసంతో ప్రగతి పరుగులు
- ఆత్మగౌరవంతో బతుకుతున్న గిరిపుత్రులు
- తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



ఎమ్మెల్యే చిన్నయ్యకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

నెన్నెల: గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ సర్కారు పెద్దపీట వేయడంతో గిరివికాసం కొనసాగుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నెన్నెల మండలంలోని కొత్తూర్, నార్వాయిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గిరిజనోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల గిరిజన విద్యార్థులు, మహిళలు మంగళహారతులు, డప్పుచప్పుళ్లతో నృత్యం చేస్తూ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ దుస్తులు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక రాష్ట్రంలో గిరిజన జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తండాలను పంచాయతీలుగా మార్చడంతో గిరిజన గ్రామాలు ప్రగతిపథంలో పరుగులు పెడుతున్నాయన్నారు. అనంతరం కొత్తూర్‌లో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు, కల్వర్టుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్, రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలు గిరిజన గ్రామాలు, తండాల్లో గిరిజనోత్సవాన్ని నిర్వహించారు. ర్యాలీలు, సభలు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లిలో సర్పంచ్ ఆలోతు లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో గిరిజనోత్సవ వేడుకలను నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. లంబాడీల ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్, సర్పంచులు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: గిరిజనోత్సవాన్ని కోటపల్లి, రాజారం, నక్కలపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గిరిజనులు కులదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేఖర్, ప్రత్యేకాధికారి సుమలత,సర్పంచ్ పొసక్క పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని కళ్లంపల్లి, నాగారాం గ్రామపంచాయతీల్లో గిరిజనోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పోచమ్మ, ముసలమ్మ జాతర చేసి బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఉద్యావన అధికారి ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, హెచ్ఎం జ్ఞానేశ్వర్, సర్పంచ్‌లు, రైతు సంఘం మండల అధ్యక్షుడు భీమయ్య, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సుదర్శన్, సిరాజ్, ప్రజలు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని నర్సాపూర్, కిష్టంపేట, రేచిని గ్రామాల్లో గిరిజనోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం పూజలు చేసి, విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రణయ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు శంకరమ్మ, దుర్గ బాయి, ఎంపీటీసీ శంకర్, గిరిజన పెద్దలు, గిరిజనులు, మహిళలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని వెంకట్రావుపల్లిలో ఎంపీటీసీ లింగస్వామి ఆధ్వర్యంలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన లక్ష్మి దేవరకు భోనాలు పోసి, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్, నాయకులు పాల్గొన్నారు.





బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి, అంకుశం గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడెం గ్రామాల్లో గిరిజనులు సంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి కుల దైవాలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్‌లు రాజమొగిళి, సురేష్, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగులో గిరిజన మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి సేవాలాల్ ఆలయం వరకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. సేవాలాల్ భోగ్ కార్యక్రమంలో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీఓ బీరయ్య, సర్పంచ్ భుక్యదేవి, బొక్కలగుట్ట సర్పంచ్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజారంలో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు



వేమనపల్లి: ర్యాలీలో అధికారులు, గ్రామస్తులు



చెన్నూర్‌రూరల్: లంబడిపల్లిలో...



దండేపల్లి: తానిమడుగులో...

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా ఆయా గ్రామాలకు చెందిన 58మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు తోడుగా నిలుస్తూ, పెళ్లికి అందిస్తున్న ఓ బృహత్తర కానుక అని, ఎన్నో నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి తోడుగా నిలిచిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయబ్ తహసీల్దార్ హరిత, సీనియర్ అసిస్టెంట్ ప్రభులింగం, లబ్దిదారులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలి'

నస్పూర్: పట్టణ పరిధిలోని సింగాపూర్ ఆర్‌అండ్ఆర్ కాలనీ మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడైన గోళీ మనోహర్ అక్రమ డిప్యూటేషన్‌పై మంచిర్యాల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడని, వెంటనే అతడి డిప్యూటేషన్‌ని రద్దు చేయాలని విద్యార్థి ఐక్య సంఘాల నాయకుడు చంద్రగిరి నరేశ్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సింగాపూర్ ఆర్‌అండ్ఆర్ కాలనీ పాఠశాల ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. సింగాపూర్ పాఠశాలలో గతంలో 40మంది విద్యార్థులు ఉండేవారని, ప్రస్తుతం ఆ పాఠశాలలో సుమారు 120వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. కాగా సింగాపూర్ పాఠశాలలో సిబ్బంది కొరతతో విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ సంబంధిత ఉన్నత అధికారుల, ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను గతంలోనే రద్దు చేసిందని వివరించారు. గోళీ మనోహర్ అక్రమ డిప్యుటేషన్‌ని రద్దు చేసి అతడిని తిరిగి సింగాపూర్ పాఠశాలకు పంపించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జోగుల ఆంజనేయులు, జాడి రాజ్‌కుమార్, బండారి అశ్విత్, దివ్యకుమార్, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న ఆశ వర్కర్లకు ఈ నెల 19వ తేదీన ప్రపంచ సికిల్‌సెల్ దినాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నదని, పెళ్లి చేసుకునే వారికి హెచ్‌బీఏ2 రక్తపరీక్షలను చేయాలన్నారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి నిర్దారణ పరీక్ష హెచ్‌బీఏ2ను కేవలం రూ.350 చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకోవాలని, ప్రజలకు ఈ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, ఎడ్ల కిషన్, ఇన్‌చార్జి డీపీహెచ్ఎన్ రత్నమాల, సూపర్‌వైజర్లు పద్మ, సరోజ, కమల, పుష్పవల్లి పాల్గొన్నారు.

సమాచారం

నేడు గుడిపేట గోదావరి తీరాన నీళ్ల పండగ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గుడిపేట గోదావరి తీరాన ఎల్లంపల్లి ప్రాజెక్ట్ సమీపంలో గల మిషన్ భగీరథ జిల్లా శాఖా ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద మధ్యాహ్నం 12గంటలకు నీళ్ల పండగ చేపట్టనున్నారు. అంతకు ముందు జిల్లా వ్యాప్తంగా 16మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ పథకంపై అవగాహన కల్పించేలా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యత, తాగునీటితో గతంలో పడిన ఇబ్బందులతో పాటు నేడు మిషన్ భగీరథతో స్థానికులు పొందుతున్న ప్రయోజనాలపై వివరిస్తూ చైతన్యం చేయనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో ఉత్తమ లబ్ధిదారులకు సన్మాన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

రేపు లక్ష్మీదేవి ఆలయం వద్ద సామగ్రికి వేలం

జన్నారం: మండలంలోని చింతగూడ లక్ష్మీదేవి ఆలయం వద్ద పలు రకాల వస్తువుల అమ్మకాలకు ఈ నెల 19న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకానికి హక్కు, మిశ్రమ ధాన్యములు పోగు చేసుకునే హక్కు, ఆటబొమ్మలు అమ్ముకునే హక్కు, టోల్ టాక్స్ వసూలు చేసుకునే హక్కు, శీతల పానియాలు అమ్ముకునే హక్కు, కిరాణ సామగ్రి అమ్ముకునే హక్కు కోసం వేలం వేస్తున్నట్లు తెలిపా రు. ఆసక్తి గలవారు ఈ నెల 19న రూ.10వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఈవో సూచించారు.

పదోతరగతి పరీక్షకు 102మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహించిన పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు శనివారం 102మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు 1202మంది విద్యార్థులకు గాను 1100మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

'గిరిజనులకు ప్రత్యేక నిధులు'



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

భీమారం: గిరిజనాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీఆర్‌డీవో శేషాద్రి పేర్కొన్నారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఎలకేశ్వరంలో శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రంలో ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, రుణాలు అందిస్తూ ఉపాధి కల్పిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రెడ్డితో పాటు సర్పంచ్ సమ్మయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గనిలో శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు లేని కారణంగా కార్మికుల సమస్యలు ఎక్కడివక్కడే పడిఉన్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో అసమర్థ సంఘాలను పక్కన బెట్టి పోరాటాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీకే మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్, గోవిందుల రమేష్, గాజుల రాయమల్లు, బాల్కోటిరెడ్డి పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాలచెట్టు సమీపంలో గల కూరగాయల సంతలో సింగరేణి పేరిట ముద్రించిన జూట్ బ్యాగులను ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ప్రజలకు పంపిణీ చేశారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచుల వాడకం నిషేదించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట పర్యావరణ అధికారి ప్రభాకర్, ఏరియా అధికారులు, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: స్థానిక జీఎం కార్యాలయం వద్ద స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉద్యోగులకు జ్యూట్ బ్యాగులను జీఎం సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, పర్యావరణానికి మేలు చేసే జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, శివరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మంథనిలోని జేఎన్‌టీయూహెచ్‌లో సింగరేణి సంస్థ తరుపున రిజర్వేషన్ కోటాలో బీటెక్‌లో ప్రవేశం కోసం ఉద్యోగుల పిల్లల నుంచి దరాఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిక్యూటీవ్ పిల్లలకు 18, ఉద్యోగుల పిల్లలకు 18సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగూడెం కళాశాలలో బీటెక్ మైనింగ్ కోర్సులో 2 సీట్లు, సీఎస్ఈ ఈఈఈలో 2, ఈసీఈలో 2, ఐటీలో 2, సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఏరియాలోని పర్సనల్ ఆఫీసర్ ఆఫీస్‌లో సంప్రదించాలని జీఎం పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కోసం నోటిఫికేషన్

మందమర్రిరూరల్: సింగరేణి పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్ కోర్సుల్లో 30చొప్పున సీట్లు కేటాయించినట్లు, అర్హత ఉండి ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల, మాజీ ఉద్యోగుల పిల్లలు ఈ నెల 23(శుక్రవారం) లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఏరియాలోని సంబంధిత అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

గనులపై స్వచ్ఛత పక్వాడా



శుభ్రం చేస్తున్న ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని పలు గనులపై స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఓపెన్ కాస్ట్ గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం రెడ్డి పాల్గొని స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం ఆవశ్యకతను ఉద్యోగులకు వివరించారు. ఈ నెల 16 నుంచి 30వరకు సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులందరూ తమ తమ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్ రక్షణాధికారి శ్రీనివాస్, అండర్ మేనేజర్లు రమేష్, వెంకన్న, సంక్షేమ అధికారి శంకర్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్, టీబీజీకే అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ అంజద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఆర్కే 5గనిపై గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, అధికారులు కలిసి గని పని స్థలాలు రెస్టాల్, క్యాంటీన్ తదితర చోట్ల చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. గనిపై ప్లాస్టిక్ దుష్పరిణామాలపై టెలిఫిల్మ్‌ను ప్రదర్శించారు. అనంతరం ఉద్యోగులతో గని మేనేజర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ రామ్ దాస్, పిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, అండర్ మేనేజర్లు ఎల్లయ్య, హేమంత్, పిట్ సెక్రటరీ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆర్కే 6 గనిపై ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు, అధికారులు కలిసి గని గని పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో గని గ్రూప్ ఇంజినీర్ వీరన్న, రక్షణ అధికారి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, గుర్తింపు సంఘం నాయకులు ఇప్ప భూమయ్య, రమేష్ అద్దు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రహరీ నిర్మాణానికి భూమి కొనుగోలు

జైపూర్: మండలంలోని ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న స్వామి ఆలయం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణానికి రెండు గుంటల భూమి కొనుగోలు చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా సర్వేనెంబర్ 191లో దుర్గం రాజలింగుకు చెందిన భూమిని రూ.5లక్షల 20వేలకు కొనుగోలు చేయగా శనివారం విక్రయదారుడికి డబ్బులు చెల్లించినట్లు సర్పంచ్ శ్యామల, ఆలయ ఈవో రమేశ్ తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు శనివారం మంచిర్యాల డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీహర ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 300మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గం వినోద్, జనరల్ మెడిసిన్ డాక్టర్ గౌతమ్, ఆసుపత్రి చైర్మన్ ముప్పిడి జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

'దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం రావాలి'

నస్పూర్: భారతదేశానికి ప్రస్తుతం రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే వచ్చిందని, దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం రావాలని న్యూ ఇండియా పార్టీ ఫౌండర్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రాజూబాయ్‌పటేల్ తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. దేశ ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ రావాలని కోరుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో మే 1 నుంచి ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

'కిచెన్ గార్డెన్‌లపై అవగాహన'

కోటపల్లి: జెడ్పీహెచ్ఎస్ కోటపల్లి పాఠశాలలో విద్యార్థులకు కిచెన్ గార్డెన్‌లపై లో ఎంపీడీవో భాస్కర్ అవగాహన కల్పించారు. పిల్లల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామ మల్లిఖార్జునస్వామి ప్రాథమిక గొర్రెల కాపరుల సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అవగాహన

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై, జన సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్ ప్రతీక్ ప్రజలకు పలు స్కీంలపై అవగాహన కల్పించారు.